# సత్యవాక్కు

## The Word of Truth



## క్రైస్తవ మాసపత్రిక

**MAY - 2010**

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2010 ఏప్రియల్ 4వ తేదీనుండి 8వ తేదీ వరకు రిక్కీగూటం గారు, కబితా గూటం గారు ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలో పలుచోట్ల సందర్శించిరి. వారు మొదట కోరాపుట్‌లోను, తదుపరి జేపూర్, నవరంగపూర్ పట్టణములలో పలువురిని దర్శించిరి. పలుచోట్ల ఒరియా బైబిళ్లు, క్రొత్త నిబంధనలు, దుస్తులు పంచియిచ్చిరి.

ఏప్రియల్ 12వ తేదీనాడు రిక్కీగారు, సుదీప, జస్టిన్ గూటం గార్లు ఖమ్మం పట్టణంలో వాక్యపరిచర్య చేసిరి. ఖమ్మంలో బోధకులభార్యల కొరకు ఏర్పాటు చేసిన బైబిలు క్లాసులో సోదరి సుదీప గూటం గారు చక్కటి వాక్య పరిచర్యచేసి, అందరినీ ముగ్ధులను చేసిరి. హాజరైన స్త్రీలందరు సుదీప గూటం గారి బోధనా విధానాన్ని శ్లాఘించిరి. ఖమ్మంలో సోదరులు ఆనందరావు గారు చాలకాలము నుండి క్రీస్తు కొరకు మంచి పని చేయుచున్నారు.

ఏప్రియల్ 13వ తేదీలో కొత్తగూడెం పట్టణాన్ని రిక్కీ దంపతులు, వారికుమారుడు జస్టిన్ గూటం గారితోసహా దర్శించిరి. క్రొత్త గూడెం దగ్గర రామవరంలో సోదరులు సి. హెచ్, బాబూరావ్, ఎ.రవిగార్లు దేవుని సేవ బలముగా చేయుచున్నారు. రామవరంలో యున్న క్రీస్తుసంఘము సత్యవాణి రేడియో కార్యక్రమముల ఫలితముగా 1989లో స్థాపింపబడినట్లు సోదరులు వివరించిరి. రామవరంలో యున్న సంఘము ప్రతి నెలా బైబిలు క్లాసులు నిర్వహించుచున్నారు. బైబిలు కోర్సును పూర్తి చేసిన వారికి రిక్కీగారు యోగ్యతా పత్రము, బైబిలు బహూకరించిరి.

ఏప్రియల్ 12,13,14, తేదీలలో నిడసన మెట్టలోని క్రీస్తు సంఘము 17వ వార్షిక సువార్త సభలు నిర్వహించిరి. ప్రతిరోజు పగలు, రాత్రి రెండు కూటములు జరిగెను. ఆ కూటములలో సోదరులు టి. ప్రసన్న విజయకుమార్ (దాక్షారామ) వి. రాజ విజయకుమార్ (రాజమండ్రి), పి.డి. బిషప్ (మండపేట), యన్. శాంసన్ రాజు (గూడపర్తి), వై. నాగేశ్వర రావ్ (రావులపాలెం) గార్లు ఆయా సమయాల్లో చక్కని వాక్య పరిచర్య చేసిరి. పగటి వేళ కూటములలో ఫిలిప్పీయులకు వ్రాయబడిన పత్రికపై ఆధారపడి వాక్యోపదేశము గావించబడెను. దూరప్రాంతములనుండి వచ్చిన వారందరికీ స్థానిక సంఘము చక్కటి భోజన పానీయముల నేర్పాటు చేసిరి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 30 | మే - 2010 | సంచిక -10


## నీవు తిరిగి జన్మించాలి

(You must be Born again)

పాపియైన ప్రతి మానవుడు మార్పు చెందాలి. పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని యేసుప్రభువు చెప్పారు (యోహాను 8:34). అట్టి మానవుడు తిరిగి జన్మించాలి. పాపరహితమైన జీవితమును అన్వేషించుచు యూదుల మతగురువు ఒకడు యేసునొద్దకు వచ్చాడు. ఆసందర్భము క్రొత్త నిబంధనలో ఇట్లు వ్రాయబడి యున్నది.

"యూదుల అధికారియైన నీకొదేమను పరిసయ్యుడొకడుండెను. అతడు రాత్రి యందు ఆయన యొద్దకు వచ్చి బోధకుడా నీవు దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను. అందుకు యేసు అతనితో ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని అతడు దేవుని రాజ్యం చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు నీకొదేము ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు? రెండవమారు తల్లి గర్భమందు ప్రవేశించి జన్మింపగలడా అని

ఆయనను అడుగగా యేసు ఇట్లనెను: "ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూల ముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయ ముగా చెప్పుచున్నాను" (యోహాను 3:1–5). ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను తిరిగి జన్మించుటలో ఏమేమి ఇమిడి యున్నవో గమనించుదాం.

పరలోకమందున్న దేవుడు మన తండ్రి. ఆయన వాక్యమే బీజము. మనము ఆయన వాక్యముద్వారా జనింపజేయ బడతాము. "మీరు క్షయబీజమునుండి కాక, శాశ్వతమగు జీవముగల దేవుని వాక్య మూలముగా అక్షయ బీజమునుండి పుట్టింపబడిన వారని" అపో. పేతురు చెప్పుచున్నాడు (1పేతురు1:23). దేవుని బీజమైన వాక్యము ప్రకటింపబడగా మన హృదయాల్లో ఆయన యందు విశ్వాసము జనింపజేయబడతాది (రోమా 10:17). యేసేక్రీస్తయి యున్నాడని నమ్ము ప్రతివా డును దేవుని మూలముగా పుట్టియున్నాడు. పుట్టించిన వానిని ప్రేమించు ప్రతివాడును ఆయన మూలముగా పుట్టినవానిని ప్రేమించును" (1 యోహాను 5:1).

"తన్ను ఎందరంగీకరించితిరో వారికందరికి, అనగా తన నామమందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను. వారు దేవుని వలన పుట్టిన వారేగాని రక్తము వలననైనను, శరీరేచ్ఛవలననైనను మనుష్యేచ్ఛవలననైనను పుట్టినవారు కారు" (యోహాను 1:12,13). యేసుప్రభువు నామమందు విశ్వాస ముంచువారికి దేవుని పిల్లలయ్యే అధికారమును దేవుడనుగ్రహించును. దేవుని బిడ్డ కావాలంటే విశ్వాసము అవసరం అయితే విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలదు. గనుక ఒకడు క్రొత్తగా జన్మించాలంటే దేవుని వాక్యము విని, విశ్వసించాలి. ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించాలని యేసుప్రభు చెప్పారు.

క్రొత్తజన్మలో నిజానికి రెండు భాగాలున్నాయి. ఒకడు నీటిమూలము గాను, ఆత్మమూలముగాను జన్మించాలి. గాని దాని అర్థమేమిటి? దీనికి జవాబిచ్చే మరొక సమానాంతర లేఖనాన్ని చూద్దాం. పెంతెకొస్తు దినమున అపో. పేతురు వేల కొలది యూదులకు క్రీస్తును గూర్చిన సువార్త బోధించాడు. యేసేక్రీస్తని, దేవుని కుమారుడని, ఆయనను వారు సిలువ వేసి చంపించారని పేతురు వారికి బోధించాడు. యేసే రక్షకుడని వారు హృదయములో విశ్వసించి, మేమేమి చేతుము? అని యడిగారు. "పేతురు మీరు మారు మనస్సుపొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పాడు (అపో.కా. 2:38).

ఒకడు పరిశుద్ధాత్మ వాక్యమును విని విశ్వసించగా అతడు ఆత్మమూలము గా తండ్రి వలన జనింపజేయబడతాడు. అట్టివాడు పాపముల విషయమై మారు మనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందగా నీటిమూలముగా జన్మించు తాడు. బాప్తిస్మమునకు ముందు ఒకడు విధిగా మారమనస్సు పొందాలి. మారుమనస్సు అనగా పాపముల విషయమై మనస్సు మార్చుకొనుట మరియు దేవునికి లోబడుతానని నిశ్చయించుకొనుట. నీటిలో బాప్తిస్మము పొందక ముందు మారుమనస్సు నొందవలెను. బాప్తిస్మమనగా నీటిలో పూర్తిగా ముంచబడుట అదొక నీటి సమాధి. యేసు క్రీస్తు సమాధి చేయబడి మూడవ దినమున తిరిగి లేచారు. అట్లే పాపియైన మానవుడు నీటిలో సమాధిచేయబడి తండ్రికుమార, పరిశుద్ధాత్మ నామమున తిరిగి లేస్తాడు. ఒక నూతన జీవియై జీవిస్తాడు. మారుమనస్సు పొందిన విశ్వాసి పొందే ఈ బాప్తిస్మము పాపక్షమాపణ నిమిత్తం జరుగుతాది.

నీకొదేము సంగతి ఆలోచించండి, అతడొక పరిసయ్యుడు. "పరిసయ్యులును ధర్మశాస్త్రోపదేశకులును యోహాను చేత బాప్తిస్మము పొందక తమ విషయమైన దేవుని సంకల్పమును నిరాకరించిరి" (లూకా 7:29-30). అందువలన నీకొదేము యేసును అడుగగానే అతడు నీటిమూలముగాను, ఆత్మమూల ముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో (అనగా క్రీస్తుసంఘములో) ప్రవేశింపలేడని ఆయన చెప్పారు (యోహాను 3:5).

భక్తిపరులమని, క్రీస్తును వెంబడించువారమని తలంచేవారిలో అనేకులు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుటకు నిరాకరిస్తారు. వేము పసిపిల్లలుగా యున్నప్పుడే బాప్తిస్మము ఇయ్యబడినదని కొందరు చెబుతారు. మొదటిగా, కొన్ని నీళ్లు నెత్తిమీద చిలకరిస్తే అది బైబిలుప్రకారము బాప్తిస్మము కాదు. అవి పసిపిల్లల మీద గాని, పెద్దవారి మీదగాని చిలకరించితే అది బాప్తిస్మము కానేరదు. మరి ముఖ్యముగా బైబిలులో పసిపిల్లలకు బాప్తిస్మమిచ్చినట్లు ఉదాహరణగాని ఆజ్ఞగాని ఎక్కడనూ కనపడదు. ఏలయనగా ఒకడు బాప్తిస్మము పొందక ముందు సువార్తను వినాలి, విశ్వసించాలి, పాపముల విషయమై మారుమనస్సుపొందాలి, యేసే దేవుని కుమారుడని నోటితో ఒప్పుకోవాలి. అప్పుడు నీటిలో ముంచడము పొందాలి. పసిపిల్లలు సువార్తను వినలేరు, గ్రహించుకోలేరు, విశ్వసించలేరు, మారుమనస్సు పొందడానికి వారికి పాపములు యేవీ లేవు; సరిగదా అట్టివారిదే పరలోకరాజ్యమని యేసుప్రభువు

చెప్పారు. గనుక చిన్నపిల్లలకు బాప్తిస్మమిచ్చే కార్యక్రమం అంతా బైబిలు విరుద్ధమైనదే, మానవకల్పితమేయని గ్రహించుకొందాము.

పసిపిల్లలుగా యున్నప్పుడు మీ తల్లిదండ్రులు మీకు చిలకరింపు ఇప్పించిన యెడల మీరు బాప్తిస్మము పొందలేదు. గనుక ప్రభువైన యేసుక్రీస్తు నామమున పాపక్షమాపణ నిమిత్తం ఈరోజే బాప్తిస్మము పొందండి. పరిసయ్యులవలె మీ యెడల దేవుడు కలిగియున్న సంకల్పమును నిరాకరించవద్దు (యోహాను 12:42-43).

మనము విశ్వసించి, మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందిన యెడల పరిశుద్ధాత్మయను వరము మనకు వాగ్దానము చేయబడినది, ఆత్మయైనదేవుడు వాక్యము ద్వారా మనలో నివసించును. ఆత్మఫలములు ఫలించుచు మంచి జీవితమును జీవించుటకు సహాయపడును. "మనము నీతిననుసరించి చేసిన క్రియల మూలముగా గాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారను మనలను రక్షించెను. మనమాయన కృపవలన నీతిమంతులమని తీర్చబడి, నిత్యజీవమును గూర్చిన నిరీక్షణను బట్టి దానికి వారసులమగుటకై ఆపరిశుద్ధాత్మను మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా ఆయన మన మీద సమృద్ధిగా కుమ్మరించెను" అని తీతు 3:5,6 చెప్పుచున్నది.

యేసుప్రభువునందు విశ్వాసముంచుము, నీపాపముల విషయమై మారుమనస్సుపొంది క్రీస్తు నామమున పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుము. అప్పుడు నీవు నీటి మూలముగాను, ఆత్మమూలము గాను జన్మించిన వాడవగుదువు.

**క్రీస్తును గూర్చిన రుజువులు :**

## చరిత్రలో క్రీస్తు యొక్క రుజువులు
## (Evidence of Christ in History)

క్రొత్త నిబంధనను మినహాయించి యేసును గూర్చి నమ్మదగిన వాస్తములేమీ ఎక్కడా లేవని కొందరు శంకింతురు. ఆయన జీవించారనీ, గొప్ప సూచకక్రియలు చేసారనీ, రోమీయుల సిలువపై చనిపోయారని, మరణాన్ని జయించి తిరిగి లేచారనీ నమ్మదగిన వాస్తవము లేవీ లేవని వారంటారు. అది నిజమా?

బైబిలులో గాక వేరే ఏమైనా రుజువులు న్నాయా? నీవే నిర్ణయించు. యేసు యొక్క పరిచర్య రోమా సామ్రాజ్యములో ఏమంత ప్రాముఖ్యత లేని ప్రాంతములో జరిగినందున ఆయనను గూర్చి లౌకిక చరిత్రలో బోలెడంత సమాచారము ఉన్నందున ఆశ్చర్యమే. ఈ పాఠములో యూదుల యొక్కయు, రోమీయుల యొక్కయు కొన్ని దస్తావేజులను పరీక్షింతము.

**జోసిఫస్ :**

క్రైస్తవేతరుడైన ఫ్లేవియస్ జోసిఫస్ మొదటి శతాబ్ధములో జీవించిన ప్రముఖ చరిత్రకారుడు. అతడు యేసుక్రీస్తును గూర్చి మొదట వ్రాసెను. క్రీ॥శ 66-74 లో యూదులకు రోమీయులకు జరిగిన యుద్ధములో గలిలయలో యూదుల విప్లవ సైన్యముల జనరల్ వెస్పేసియన్ యోటాపాట పట్టణమును పట్టుకొనగా జోసిఫస్ తన్నుతాను బందీగా అర్పించు కొని తదుపరి తన జీవిత కాలమంతా రోమీయులకు సేవచేసెను.

జోసిఫస్ క్రీ॥శ 37లో జన్మించి 94లో చనిపోయెను గనుక అతడు అపోస్తలుల సమకాలికుడు. మొదటి శతాబ్ధము చివరి భాగములో అతడు యూదుల యుద్ధములు, యూదుల పూర్వోత్తరములు (The Jewish wars & The Jewish Antinquities ) అను చారిత్రక గ్రంథములు వ్రాసాడు.

యూదుల పూర్వోత్తరాలు 20వ గ్రంథము 9వ అధ్యాయములో యేసును ఆయన సహోదరుడగు యాకోబును గూర్చి అతడు వ్రాసాడు. అతడిట్లు వ్రాసాడు : "ఫేస్తు ఇప్పుడు చనిపోయెను, అల్బేనియన్ ఇప్పుడు మార్గములో యున్నాడు. గనుక అన్నా సమాజమందిరపు న్యాయాధిపతులను కూడబెట్టి క్రీస్తు అనబడిన యేసుయొక్క సహోదరుడగు యాకోబును, మరికొందరిని వారి మధ్యకు తెచ్చెను. వారందరు చట్ట విరుద్ధముగా ప్రవర్తించుచున్నారనే ఆరోపణ చేసి, రాళ్లతో కొట్టబడి చంపదునట్లు వారిని అప్పగించెను".

యూదుల ప్రధాన యాజకుడ అన్నా అహంకారుడు, ధైర్యవంతుడు. రోమా గవర్నరయిన ఫేస్తు చనిపోగా, క్రొత్త గవర్నరు రాకముందే అతడనేక క్రైస్తవ నాయకులను, యేసు సహోదరుడగు యాకోబును కూడ హతమార్చుటకు ఆ తరుణమును వినియోగించుకొనెను.

జోసిఫస్ వ్రాసిన ఈ చారిత్రక వాస్తవమును ఎవరు విమర్శించలేదు, ప్రశ్నించలేదు, అతని మాటలు యేసే క్రీస్తని, అభిషిక్తుడని మనకు రుజువు చేయుచున్నవి.

యూదుల పూర్వోత్తరాలు 18:63, 64లో జోసిఫస్ ఈలాగు కూడ వ్రాసాడు : "ఈ కాలమందు యేసు అను ఒక జ్ఞాని యుండెను. ఆయన అద్భుతములు చేసెను. సత్యమును సంతోషముతో అంగీకరించు వారికి ఆయన ఉపదేశకుడు, ఆయనను

యూదులు అన్యులు కూడ వెంబడించిరి.ఆయనే క్రీస్తు. మాలో కొంత మంది ఒత్తిడి వలన పిలాతు సిలువ వేయబడుటకు అప్పగింపగా, ఆయనను వెంబడించిన వారు మొదట ఆయనమ విసర్జించలేదు. ఏలయనగా ఆయనను గూర్చి ప్రవక్తలు ముందుగానే వేవేలసార్లు ప్రవచించిన రీతిగా మూడవ దినమున ఆయన తిరిగి లేచెను. వారికి అగుపడెను. ఆయనను బట్టి క్రైస్తవులు అనిపిలువబడు గుంపువారు నేటికిని నశించకుండా యున్నారు".

ప్రత్యక్ష సాక్షులు ఇంకను బ్రదికి యుండగా క్రైస్తవేతరుడైన చరిత్రకారుడు వ్రాసిన మాటలు చాల శక్తివంతమైనవి. పైన చెప్పబడినదంతా నూటికి నూరు పాళ్లు వాస్తవ లిఖితమేయని అందరు అంగీకరించారు. యేసు జ్ఞానియని, అద్భుతముల చేసారని ఆయన అనేకులను ఆకర్షించారని మనకు రుజువున్నది. యూదుల యొక్క ప్రోద్భలము వలన ఆయనకు శిక్ష విధింపబడి సిలువ వేయబడెను. గాని ఆయనను ప్రేమించిన వారాయనను విసర్జించలేదు. జోసిఫస్ ఈ వాస్తవములు వ్రాసేసరికి (క్రీ॥శ90లో) క్రైస్తవ జాతి మరుగైపోలేదు.

**యూదుల తాల్మడ్ :**

బబులోను తాల్మడ్‌లో 63 గ్రంధములున్నవి, దానిలో యూదులకు నైతిక, ఆధ్యాత్మిక చారిత్రక, న్యాయపరమైన, ఆచార కర్మలు వగయిరా వ్రాయబడియున్నాయి. అనేక శతాబ్ధముల తరబడి వ్రాయబడిన గ్రంధములవి. గాని యేసును గూర్చి వ్రాయబడిన భాగము క్రీ॥శ 70 నుండి 200లోగా వ్రాయబడెను. దానిలో సమాజమందిర భాగము 43... లో ఈలాగు వ్రాయబడియున్నది:

"పస్కా సాయంకాలమున వారు నజరేతువాడైన యేసును వ్రేలాడదీసిరి. ఆతడు గారడీ చేస్తూ ఇశ్రాయేలీయులను దారి తప్పించాడు గనుక అతనికి రాళ్లు రువ్వబడుననే ప్రకటన 40 దినముల మట్టకుచేయబడెను. అతని పక్షముగా ఎవరైన ఏదైనా చెప్పాలనుకొంటే ముందుకు రావచ్చును. అయితే అతని పక్షముగా ఏమీ కనబడనందున పస్కానాడు వారతని వ్రేలాడదీసిరి".

యిది శత్రు స్థావరమునుండి వచ్చిన దృఢపరచు సమాచారము. ఆయనను వ్యతిరేకించిన యూదుల నాయకుల వలన యేసు వ్రేలాడదీయబడెను (సిలువవేయబడెను) అని అంగీకరించిరి (అపొ.కా. 5:30; 10:39). ఆయన అద్భుతములు చేసెనని (వారు గారడీ అన్నారు) అనేకులను ఆయన యూదుల బోధనుండి మళ్లించారని, పస్కానాడు ఆయన సిలవవేయబడెనని వారంగీకరించారు.ఆయనను రాళ్లు రువ్వి చంపాలని

యూదుల నాయకులు కుట్రపన్నారు గాని ఆయన చివరకు సిలువ వేయబడ్డారు. ఈ చారిత్రక వాస్తవములలోని ముఖ్యాంశములు సువార్తలలో వ్రాయబడిన దానితో పూర్ణముగా ఏకీభవించుచున్నవి.

**ప్లినీ ద యంగం :**

రెండవ దశాబ్ధపు ఆరంభములో ప్లినీ ద యంగర్ అనునతడు బితూనియకు గవర్నరుగా యుండెను. (అదిటర్కీ దేశములో వాయవ్య భాగము) గాని అతడొక సందిగ్ధములో పడెను. అతని యొద్దకు విచారణకు తేబడిన క్రైస్తవులు హాని కలిగించేవారుగా అతనికి కనబడలేదు. గాని వారు రోమా చక్రవర్తిని మాత్రం ఆరాధించుటకు నిరాకరించిరి. తద్వారా స్థానికంగా విగ్రహాలను తయారుచేసే వారి వ్యాపారానికి నష్టము కలిగించుచుండిరి. అందువలన ప్లినీ క్రీస్తును నిరాకరించని కొంతమంది క్రైస్తవులను చంపుటకు నిర్ణయించాడు. అతడు చేసేది సరియోకాదో గ్రహించలేక ప్లినీ తన మిత్రుడైన ట్రాజన్ చక్రవర్తికి ఉత్తరం వ్రాసి అతని సలహా కోరాడు. ఆ లేఖ క్రీ॥శ 112లో వ్రాయబడింది.

**ప్లినీ ఇట్లువ్రాసాడు :**

"నేను క్రైస్తవుల విమర్శలో ఎన్నడు పాల్గొనలేదు. అందువలన వారాచరించేది నేరమని చెప్పుటకు ఎంతమట్టుకు పరిశోధించాలో తెలియడంలేదు. ఈలోగా నేను దిగువ సంగతులను అనుసరించాను. వారు క్రైస్తవులో కాదోయని వారిని ప్రశ్నించాను, అవునని ఒప్పుకొన్నా వారిని రెండవసారి ప్రశ్నించాను. వారికి శిక్ష విధిస్తానని భయపెడుతు మూడవసారి ప్రశ్నించాను. అయినను క్రైస్తవులమేయని ఒప్పుకొన్న వారిని చంపాలని ఆదేశించాను. వారి మతం యేమిటో గాని వారి పట్టుదల, మొండితనం తప్పక శిక్షించబడాలి. యిదే వెర్రి నమ్మకాన్ని కలిగిన మరి కొందరు కూడ యున్నారు. గాని వారు రోమాదేశ పౌరులైనందున వారిని రోమాకు తరలించాను...

"అయితే క్రైస్తవులు మాత్రం వారొక ప్రత్యేక దినమున కూడుకొనుటకు, క్రీస్తు అను దేవునికి పాటలు పాడుటకు అలవాటుపడ్డామని చెబుతారు. వారు మోసము, అబద్ధము, దొంగతనము, వ్యభిచారము, జారత్వము, జరిగించ కూడదని ఆదినమున ప్రమాణము చేస్తారు. యిది జరిగిన అనంతరం వారు వెళ్లిపోయి మరల సామాన్యమైన ఆహారము తినుట కొరకు తిరిగి కూడుకొందురు.

"అందువలన నేను నా పరిశోధనను ఆపుచేసి తమరిని సలహా అడుగుటకు తొందరపడ్డాను. వారు అసంఖ్యాకంగా యున్నందున మిమ్మును సలహానడుగుటకు తొందరపడ్డాను. ఏలయనగా అన్ని స్థాయిలలోను. వయసులోను యున్న స్త్రీ

పురుషులు, ప్రమాదములో యున్నారు. ఈ అంటువ్యాధిలాంటి వెర్రి నమ్మకము పట్టణములలోనే గాక, పల్లెలలోను పొలములలోను కూడ వ్యాపించియున్నది".

రెండో శతాబ్ధపు ఆరంభములో యున్న క్రైస్తవ్యమును గూర్చిన సమాచారము కొరకు ఈ లేఖ చాల ప్రాముఖ్యమైన ఆధారము. దానిని బట్టి బితునియాలో యున్న క్రైస్తవులు క్రీస్తును దేవునిగా ఆరాధించేవారు. వారికి నైతిక సాంఘిక విలువలుండేవి, క్రీస్తును నిరాకరించడం కన్నా చనిపోవుటకే వారు యిష్టపడే వారు, మరియు క్రైస్తవ్యము ప్రతి జాతిలోను, స్త్రీపురుషులలోను, రోమా పౌరులలోను కూడ వ్యాపించుచుండెనని మనం గ్రహించ గలుగుచున్నాము.

**కొర్నేలియస్ టేసిటస్ :**

రెండవ శతాబ్ధములో టేసిటస్ అనునతడు చాలా ప్రాముఖ్యమైన రోమాచరిత్రకారుడు. అతడు క్రీస్తును గూర్చి ప్రాముఖ్యమైన సంగతిని చెప్పాడు.

క్రీస్తు మరణించిన తరువాత క్రీ॥శ 54లో జన్మించి టేసిటస్ వెస్పేసియన్ కాలములో సెనేటర్‌గా పనిచేసాడు. అతడు వ్రాసిన 5 చరిత్ర గ్రంధములు ప్రఖ్యాతి గాంచాయి. అందులో 4 ఇంకా భద్రంగానే యున్నాయి. అతడు చారిత్రక వృత్తాంతములు (Annals) అనే 12 సంపుటిలను కూడ వ్రాసాడు.

అతడు వ్రాసిన వృత్తాంతములు (Annals) 15:44లో క్రీ॥శ 64లో నీరోచక్రవర్తి రోమా పట్టణాన్ని తగుల బెట్టి, ఆ పట్టణం నాశనం కాగా తన మీద నింద రాకుండా క్రైస్తవులను హింసించాడు. క్రీ॥శ॥115లో అతడిట్లు వ్రాసాడు : "ప్రజల వలన క్రైస్తవులనబడే వారిపై నీరో ఈ అపరాధము మోపి అతి ఘోరంగా వారిని హింసించాడు. క్రిస్టస్ (క్రీస్తు) అనునతని పేరును బట్టి ఈ మతము ఉధ్భవించింది. అతడు తిబెరెయ ఏలుబడిలో అధిపతియైన పిలాతు చేతులలో అతి భయంకర మరణాన్ని పొందాడు. ఈ వెర్రినమ్మకము ప్రస్తుతానికి అదుపు చేయబడగా, మరల అది యూదయలో వ్యాపించెను. గాని సమస్త దుష్టత్వానికి అవమానమునకు కేంద్రమైన రోమాలో కూడ యిది వ్యాపించెను".

"అందువలన అపరాధులమని ఒప్పుకొనిన వారందరినీ మొదట బంధించుట జరిగెను. వారిచ్చిన సమాచారాన్ని బట్టి అసంఖ్యాకులైన ప్రజలకు శిక్ష విధించబడెను, రోమా పట్టణమును తగులు బెట్టించినందుకు గాక ప్రజలలో ద్వేషమును రెచ్చగొట్టించినందు కీలాగు జరిగెను. వారు చంపబడక ముందు రకరకాలుగా హేళన చేయబడిరి. జంతు చర్మములు కప్పబడి కుక్కలచే వారు చీల్చబడిరి. ఈ దృశ్యములు తిలకించుటకు నీరో

తన తొటలను సర్కస్ స్థలములుగా వినియో గించెను".

తిబెరయి ఏలుబడిలో పొంతి పిలాతు చేతులలో క్రీస్తు ఘోరమైన సిలువ మరణము పొందెనని టేసిటస్ వ్రాసాడు. మరణము పొందుటకు సహితము యిష్టపడిన క్రైస్తవుల వెర్రి నమ్మకము క్రీస్తు చనిపోయి సమాధినుండి తిరిగిలేచెనను వాస్తవమే.

క్రీస్తును గూర్చి క్రైస్తవులను గూర్చిన అదనపు సమాచారము సమోసాటకు చెందిన లూసియన్, మారాబార్ సెరాపియస్, సుటోనియస్, థేలస్ అను వారి వ్రాతలలో లభ్యమగును. ఈ చరిత్రకారుల దస్తావేజులలో రోమా సామ్రాజ్యములో క్రీస్తు యొక్క ప్రభావము కనబడును.

## మానవుని నైతిక స్వేచ్ఛ
## (The free Moral Agency of Man)

తీర్పు సమయంలో దేవుడు యదార్ధవంతుడుగా యుండాలంటే మానవుడు నైతిక స్వేచ్ఛకలిగిన వాడై యుండాలి. అంటే మానవుడు తన యిష్ట ప్రకారము ఎంచుకొనే స్వాతంత్ర్యము కలిగిన వాడై యుండాలి.

మానవుని నైతిక స్వేచ్ఛకొరకు కావలసినవి

**1.ఎంపికశక్తి :**

అతనికి తెలియ జేయబడిన శాసనమును గూర్చి ఎంపిక చేసుకోవలసివస్తే అట్టి ఎంపిక చేసుకొనే మానసిక శక్తి (స్థితి) అతడు కలిగి యుండాలి. దేవుడు ఆదామును ఏదెను వనంలో యుంచారు. దానిలో ఆయన మంచి చెడులను తెలియజేయు వృక్షమును కూడా యుంచారు. ఆ చెట్టును గూర్చి యైతే "దానిని తినవద్దు" అనే శాసనం అతనికీయబడింది.(ఆది 2:17). అయితే ఆ అజ్ఞను గూర్చి ఎంపిక చేసుకొనే శక్తి మానవునికి లేకపోతే, అట్టి ఆజ్ఞ అర్ధ రహితం. ఎంపిక శక్తి లేని మానవుని శిక్షించడం అన్యాయం.

**2. ఎంపికకు తగిన వాతావరణం:**

ఎంపిక శక్తి గల మానవుడు ఎంచుకోగల్గిన వాతావరణంలో లేని యెడల అతడు స్వతంత్రుడు కానేరడు. ఆదాము హవ్వలు నైతిక స్వేచ్ఛ కలిగి యుండునట్లు దేవుడు వారి యెదుట కొన్ని ఎంపిక చేసుకొనే నిర్ణయాలను ఉంచియున్నారు. అందు వలననే సాతానుడు మోసగించ గలుగు లోకములో మానవుడు ఉంచబడెను. సత్యమునననుసరించి మానవుడు నిర్ణయించు కొనునట్లు, వంచన

యొక్క వాస్తవికత అతనికి తెలయజేయ బడెను. నైతిక స్వేచ్ఛ కలిగిన వారు గనుక మానవులు తావము నివసించు వాతావరణంలో నిర్ణయాలు గైకొను శక్తి గలవారు.

**3. ఎంపికకు స్వేచ్ఛ :**

మానవుడు ఫలాన విధంగానే ప్రవర్తించునట్లు సృజించబడిన యెడల అతడొక మరమనిషి (Robot) అవుతాడు. అయితే మర మనిషిని మనం ప్రేమించ లేము. కాబట్టి దేవుడు తన ప్రేమను కుమ్మరించు సంబంధము కలిగి యుండాలంటే మానవుడు నైతిక స్వేచ్ఛ కలిగిన వాడుగా సృజింపబడుట అత్యవసరం. మానవుడు పవిత్రుడుగానే సృజింపబడెను. పసిపిల్లలు పవిత్రులుగానే పుట్టుదురు. మానవుడు మంచినే చేసి పరలోకమునకు వెళ్లగల్గునట్లు గాని చెడు చేసినరకానికి వెళ్లునట్లుగాని ముందుగా నిర్ణయించి చేయబడ లేదు. ఎక్కడికి వెళ్లవలెనో నిర్ణయించుకొనే స్వేచ్ఛను అతడు కలిగి యున్నాడు.

**మానవుని నైతిక స్వేచ్ఛను బైబిలు అంగీకరించుచున్నది:**

మానవుడు నైతిక స్వేచ్ఛ గల వాడని బైబిలు ఉద్ఘాటించుచున్నది. "మీరు ఎవరిని సేవింతురో నేడు కోరుకొనుడి" యని ఇశ్రాయేలీయులను యెహోషువ హెచ్చరించాడు (యెహోషు 24:15). "మేలును కోరుకొనుడి"యని యెషయా హెచ్చరించాడు (యెషయా 7:15). రండి మన వివాదము తీర్చుకొందమని దేవుడు ఇశ్రాయేలీయులను ప్రోత్సహించారు (యెష 1:18). ఆయన ఆజ్ఞలనను సరించాలని వారిని బలవంతముచేయ లేదు. దానిని బట్టి తమ నిత్యగమ్యం ఆధారపడి యుంటాది. క్రొత్తనిబంధనలో పౌలు పేతురులాంటి ఆత్మావేశము గలవారి యొక్క నైతిక స్వేచ్ఛ వక్కాణించబడింది. వీరు పరిశుద్ధాత్మావేశము గలవారే అయినను, వారి నైతిక ప్రవర్తనను పరిశుద్ధాత్మ కంట్రోలు చేయలేదు.

పరిశుద్ధాత్మ ప్రేరణచే మాట్లాడునప్పుగాని, వ్రాయునప్పుడు గాని ప్రజలు సత్యమునే పలికారు. వారి ప్రవర్తన అయితే వారి స్వయం నిర్ణయము చొప్పుననే యుండేది. బయల్పాటు విషయంలో వారు నేరుగా పరిశుద్ధాత్మ నడిపింపులో యున్నను వారినైతిక ప్రవర్తన అయితే పరోక్షముగా బయల్పరచబడిన సత్యమును బట్టియుండేది. అందు వలన తామును, యితరులును కూడ తమ రక్షణ విషయంలో తమనైతిక సేచ్ఛను వినియోగించుకోవాలని హెచ్చరించారు. క్రైస్తవ సద్గుణములను అలవరచు కొనుటకు ప్రతి క్రైస్తవుడు శ్రద్ధకలిగి యుండాలని పేతురు హెచ్చరించాడు (2 పేతురు 1:5). "సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము

చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి" యని అతడు హెచ్చరించాడు (2 పేతురు 1:10). క్రైస్తవ సద్గుణములను గూర్చిచెబుతు "అవి మీకు విస్తరించిన యెడల అవి మిమ్మును సోమరులైనను, నిష్ఫలులైనను కాకుండ చేయునని" తెలియజేసాడు. "మీరిట్టి క్రియలు చేయు వారైతే ఎప్పుడును తొట్రిల్లురు" అని అతడు చెప్పాడు. ఈ సంగతులు చేయుటలో ఒక వ్యక్తి యొక్క బాధ్యతను అతడు వక్కాణించాడు . మానవుడు నైతిక స్వేచ్ఛకలిగిన వాడయితేనే అతని హెచ్చరికలకు విలువ యుంటాది.

మానవుడు నైతిక స్వేచ్ఛను వినియోగించుకోవాలని దేవుడు కోరును:

తన ప్రవర్తన విషయమై దేవుడు మానవుడుని బాధ్యుడుగా ఎంచును. అందు వలన ఆదిమ సువార్తికులు మీరు మారు మనస్సుపొందుడి యని హెచ్చరించే వారు (అపొ.కా . 2:38, 17,31, 2 పేతురు 3:9). తమ నైతిక సేచ్ఛను వినియోగించుకోవాలని హెచ్చరించేవారు. "గనుక దేవుని దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషమునుండి మనలను పవిత్రులనుగా చేసికొందము" (2కొరి 7:1). "అపవిత్రమైన దానిని ముట్టకుడి....."(2 కొరి 6:18). దేవుని చట్ట విషయంలో మానవునికి నైతిక స్వేచ్ఛ లేనప్పుడు అట్టి హెచ్చరికలు వ్యర్థం. అయితే పరిశుద్ధాత్ముని గూర్చి ఒక వ్యక్తి అనుసరించే సిద్ధాంత మెట్లున్నను దేవుడు ప్రతి వానిని వాని ప్రవర్తన విషయంలో బాధ్యునిగా ఎంచును. ఏలయనగా మనమందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును (2 కొరి 5:10).

- రోజర్ డిక్సన్

## పెంతుకొస్తు దినము

## (The Day of Pentecost)

"కాబట్టి అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి ఆదినమందు ఇంచు మించు మూడు వేలమంది చేర్చబడిరి" (అపొ.కా. 2:41). అపొస్తలులకార్యములు రెండవ అధ్యాయములో పెంతుకొస్తు దినమున క్రీస్తులోనికి మూడువేల మంది బాప్తిస్మము పొందిరి. వారు నాడున్న లోకమంతటి నుండి వచ్చిన వారు ఎంత ఆశ్చర్యము! నాటి ప్రసంగీకుడైన పేతురు ప్రఖ్యాతిగాంచిన వాడు కాడు. యూదుల రబ్బీ కూడ కాదు! ఆ జన సమూహాము నకతడు ఏమి చెప్పబోవుచుండెనో ముందుగా ఎరిగిన వాడు కాదు. పరిశుద్ధాత్ముడతని నోట తన వాక్యముంచెను. యేసు ఎవరో, ఆయన యేమి చేసెనో వారికతడు వివరించాడు. చరిత్రయంతటి లోను గొప్ప స్పందనను కలిగించిన గొప్ప ప్రసంగమది,

అన్నిటికంటే ఆశ్చర్యమైన సంగతి, సంఘము ఆశ్చర్యరీతిగా స్థాపించ బడెను! అది సిలువను గూర్చిన వార్త ప్రకటించుట ద్వారా సంభవించెను.

అసంఘిటితముగా జరుగునట్లు దేవుడు దేనినీ విడిచి పెట్టలేదు. సమస్తము సమకూడి జరుగునట్లు ఆయన సంకల్పించారు. యూదులకు యెరూషలేము యాత్ర తమ మత సంబంధమైన గొప్ప యాత్ర. జీవితంలో ఒకానొకసారి సంభవించే అనుభూతి అది. వారిలో కొంతమంది పస్కాపండుగ అయిపోయిన తరువాత యాభైదినముల మట్టుకు యెరూషలేములో నిలిచియుండిరి, వారంతా గుంపుగా గుమిగూడి యుండిరి. వారు పస్కాపండుగను గూర్చి, క్రీస్తు సిలువను గూర్చి, ఖాళీ సమాధిని గూర్చి సంభాషించుకోకుండా యుండ లేక పోయారు.

ఇటువంటి పస్కాపండుగ మున్నెన్నడు జరుగలేదు ! సంభవించిన దానిని గూర్చి ఇశ్రాయేలీయులు ఆలోచించుకొనుటకు దేవుడు యాభైదినముల గడువు నిచ్చారు. భూకంపము వలన వారి హృదయములు కంపించాయి (మత్త 27:45; మార్కు 15:33; లూకా 23:44). మధ్యాహ్నము మొదలుకొని రమారమి మూడు గంటలు ఆదేశమంతా చీకటికమ్మెను; ప్రజలు యేసును సిలువ వేయునట్లు దేవుడు సంకల్పించెను గాని ఆయన మరణమును గూర్చి వారు సంతోషించుటకాయున నిరాకరించెను. గనుక ఆరోజు మధ్యాహ్నం నుండి మూడు గంటలవరకు వాతావరణం అంతా భయం, భయం! అంధకారం; ఆయెూమయం; ప్రజలందరిలో ఆందోళన ఆవేదన, ఎటూ కదలలేని పరిస్థితి !

"మనమేమిచేసాము?" అనేది ప్రతి వాని మనసులోయున్న ప్రశ్న! కొండలు బ్రద్దలయ్యాయి, సమాధులు తెరువబడ్డాయి, సమాధులలో నున్న వారు బయటికి వచ్చి అనేకులకు అగపడ్డారు (మత్త 27:51). మూడు గంటల వేళ దేవాలయములో యాజకులు పరిచర్యచేయుచుండగా దేవాలయపు తెర పైనుండి క్రింది వరకు రెండుగా చినిగి పోయింది (మత్త 27:51; మార్కు 15:58; లూకా 23:45). "సిలువ వేయుము, సిలువవేయుము" అని బిగ్గరగా అరచిన ఆరుపులు ఇప్పుడు ఆవేదన మయమయ్యాయి, జరిగిన కార్యములన్నీ చూచి వారుభయకంపితులై తమ రొమ్ముకొట్టుకొనిరి. ఆయనను సిలువ వేసిన రోమా శతాధిపతి కూడ యేసు నిజముగా దేవుని కుమారుడని గుర్తించాడు (మత్త 27:54; మార్కు 15:39).

యెరూషలేములో యున్న వారంతా యాభైదినముల మట్టుకు చూడ గలిగినది అంతా ఖాళీ సమాధియే. పిలాతును, యూదుల

నాయకులును యేసు తిరిగి లేచారని ఎరుగుదురు. ఆయనను, లేక ఆయన శరీరాన్ని వెదకాలని వారు బంట్రోతుల నేమీ పంపలేదు, అపొస్తలులను కూడ వారు ప్రశ్నించలేదు. యేసు తిరిగి లేచినట్లు శిష్యుల కంటె ముందుగా ఆయన శత్రువులే తెలిసికొన్నారు.

యేసు క్రీస్తు తిరిగి లేచారు! ఆయన మరలా చనిపోలేదు. సరిగదా నలువది దినముల మట్టుకు ఆయన తన శిష్యులకు అగుపడిన తరువాత పరలోకమందున్న తన తండ్రి దగ్గరకు ఆరోహణమయ్యారు (అపొ.కా. 1:3). ఆయన మేఘములగుండా కొనిపోబడెను. ఇప్పుడు దేవుని కుడి పార్శ్వమున ఆయన ఆశీనుడై యున్నారు (ఎఫెసీ 1:20;కొలస్స3:1).ఆయన ఆరోహణము కాక మునుపు తన శిష్యులతో, "పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూది గంతముల వరకు నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను" (అపొ.కా .1:8).ఆవాగ్దానము కొన్నిదినముల తరువాత, అనగా పెంతెకొస్తునాడు నెరవేరెను.

ఆ సందర్భములో వేగముగా వీచు గొప్పగాలి వంటి యొక ధ్వనివలె దేవుడు దిగి వచ్చెను. పరిశుద్ధాత్మ దేవుడు అపొస్తలులపై కుమ్మరింపబడెను, అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి ఒక్కొక్కని మీద వ్రాలెను. అపొస్తలులందరు దేవుని గొప్పకార్యములను వారు యిదివరలో నేర్చుకొనని భాషలలో వివరించుటకు మొదలు పెట్టిరి.

అప్పుడు పేతురు లేచి యాభైదినముల క్రితము యేమి జరిగినదో గొప్ప ప్రసంగములో వారికి వివరింప బూనుకొన్నాడు. అతని మాటలు వినుచున్నవారు ఆ సంఘటనకు సాక్షులు మాత్రమే గాక దానికి కారకులు కూడా యని చెప్పాడు. వారు దేవుని కుమారుని హత్యగావించారని నిందించాడు. ఈ మాటలు విని వారు తమ హృదయములో పొడువబడిరి. సహోదరులారా మేమేమి చేయాలి? అని వారు ప్రశ్నించారు. మారు మనస్సు పొందారు. మూడు వేల మంది తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందారు. వారు ఈ రీతిగా మార్పు జెందుట ద్వారా క్రీస్తు సంఘము పెంతెకొస్తు దినమున యెరూషలేములో ఆరంభమాయెను.

ఈ లోకంలో యున్న సైన్యములన్ని, సమావేశమవుచున్న శాసన సభలన్నీ, పాలించిన రాజులందరు యేసుక్రీస్తు వలె మన జీవితాలను తాకినట్లు ఎవరు తాకలేదని చరిత్ర బయలు పరచుచున్నది. మూడువేల మంది ఆరోజు బాప్తిస్మము పొందుట ఒక అకస్మిక సంఘటన కాదు. సాతానుడు తానకుతానే ఓడిపోయాడు. సిలువకు మించిన మార్గం ఇంకోటి యేదీ లేదు! – చార్ల్స్‌హాడ్జ్

# దేవుని దొడ్డిలోనికి మానవుని తిరిగి చేర్చుట
## (Bringing back man to God's fold)

దేవుడు ఆకాశమును భూమిని ఆరుదినములలో చేసెను. దేవుడు నేలమంటి నుండి నరుని నిర్మించి వాని నాసికారంధ్ర ములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను. (ఆది 2:7). దేవుడైన యెహోవా ఆదాముకు గాఢనిద్ర కలుగజేసి అతని ప్రక్కటెముకలలో ఒకదానిని తీసి దానితో స్త్రీని నిర్మించి ఆస్థానమును మాంసముతో పూడ్చివేసెను. ఆస్త్రీని అతనికి ఒక సాటియైన సహాయంగా చేసెను. ఆయన సృష్టి కార్యమంతటిని ముగించి ఏడవదినమున విశ్రమించి దానిని పరిశుద్ధపరచెను. దేవుడైన యెహోవా ఒక తోటను వేసి చూపునకు రమ్యమైనదియు , ఆహారమునకు మంచిదియు నైన వృక్షములను జీవ వృక్షమును, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షములను మొలిపించెను. ఆయన మానవుని ఏదెనువనమును సేద్యపరచుటకు కాపుకాయుటకు అందుం చెను. దేవుడైన యెహోవా ఈతోటలోనున్న ప్రతి వృక్షఫలమును నీవు నిరభ్యంతరముగా తినవచ్చును. అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదు, నీవు వాటిని తినుదినమున నిశ్చయముగా చచ్చెదవు" (ఆది2:16,17)" అని చెప్పెను. దేవుడు వారిని ఆశీర్వదించెను. ఎట్లనగా మీరుఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోబరచుకొనుడి" (ఆది 1:28).

దేవుడు నేలమంటినుండి నరుని నిర్మించాడు. అందువల్ల భూమిలో ఉన్నటు వంటి రసాయనాలే మానవుడు తన శరీరంలో కలిగి ఉన్నాడు. గాని అతని ప్రాణాత్మలు మాత్రం జీవముగల దేవుడు సృష్టించాడు. అతని మనుగడకు అన్నిరకాల మంచి ఆహారమును మొలిపించాడు. అతడు చేయుటకు పనిని జీవముగల ప్రతి దానిని ఏలుటకు ఈ భూమి మీద అధికారమును ఇచ్చా డు. లోబడుటకు ఆజ్ఞను ఇచ్చి దానిని జవదాటితే వచ్చే పర్యవసానము గురించి ఆయన అతనిని హెచ్చరిం చారు.

మానవుడు దేవుని ఆజ్ఞను మీరి తినవద్దు అనిన పండును తినినట్లు మనం లేఖనముల ద్వారా తెలిసికొన గలం. దేవుడు సర్పమును, ఆదాము, హవ్వలను, భూమిని శపించారు. ఆయన చర్మపు చొక్కాలను చేయించి వారికి ధరింపచేసాడు. "అప్పుడాయన ఆదామును వెళ్లగొట్టి ఏదెను తోటకు తూర్పుదిక్కున కెరూబులను, జీవ వృక్షమునకు పోవు మార్గమును కాయుటకు ఇటు అటు తిరుగుచున్న ఖడ్గజ్వాలను నిలువబెట్టెను "(ఆది 3:24). మానవుని యొక్క ఆజ్ఞాతి

క్రమము వల్ల లోకంలో పాపం ప్రవేశించింది. ఆదాముయొక్క పాపము వల్ల ఆధ్యాత్మిక మరణము భౌతిక మరణము ఈ లోకంలోకి ప్రవేశించాయి. ప్రేమ గల దేవుడు మానవుడు నిత్యము తనతో సంతోషంగా జీవించాలని మానవుని నిర్మించారు గాని పాపము మానవుని ఆతని ప్రేమగల తండ్రి నుండి వేరుపరచింది. ఆయన పిల్లలను ఆయన కౌగిటిలోకి తిరిగి చేర్చుకోడానికి, మానవజాతిని రక్షించడానికి ఆయన ఒక పధకం తయారు చేసారు. మనం నశింపక నిత్యజీవము పొందునట్లుగా దేవుడు ఆయున అద్వితీయం కుమారుని ఈ లోకంలోనికి పంపారు. (యోహాను 3:16). "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనష్య కుమారుడు వచ్చెను" (లూకా 19:10). "అయితే కాలము పరిపూర్ణమైనపుడు దేవుడు తన కుమారుని పంపెను అయన స్త్రీయందు పుట్టి...మీరు కుమారులై యున్నం దున....... కాబట్టి నీవిక దాసుడవు కావు కుమారుడవే కుమారుడవైతే దేవుని ద్వారా వారసుడవు" (గలతీ 4:4-7).

ఆయన కుమారుడైయుండియు తానుపొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను. తనకు విధేయులైన వారికందరికిని నిత్యరక్షణకు కారకు డాయెను". (హెబ్రీ 5:8,9; 1పేతురు 3:18;1:25). ఏలయనగా పాపము వలన వచ్చుజీతము మరణము, అయితే దేవుని కృపావరము మనప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము", (రోమా 6:23).

ఆదాము యొక్క అజ్ఞాతిక్రమము వల్ల మరణము ఈలోకంలో ప్రవేశించింది మొదటి మనుష్యుడు భూసంబంధియై మంటినుండి పుట్టిన వాడు, రెండవ మానష్యుడు పరలోకమునుండి వచ్చిన వాడు".(1 కొరిం 15:47). ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు. (1కొరిం 15:22). "మరియు మనము మంటి నుండి పుట్టిన వాని పోలికను ధరించిన ప్రకారము పరలోక సంబంధి పోలికయు ధరింతుము (1కొరింధి 15:49). దేవుడు మానవుని ఆయన పోలికగా చేసారు గాని మానవుడు పాపము చేసి ఆపోలికను పోగొట్టుకొనెను. మనము తిరిగి అయనపోలికను పొందు నట్లు యేసు క్రీస్తు ప్రభువు ఈ లోకంలోకి వచ్చారు. గలతీ సంఘానికి అపొ॥పౌలు ఇలారాస్తున్నాడు "నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీ యందేర్పడు వరకు మీ విషయమై మరలనాకు ప్రసవ వేదన కలుగుచున్నది" (గలతీ 4:19). ఫిలిప్పిలో నున్న క్రైస్తవులకు ఆతను ఇలాగు చెప్పాడు "మన పౌరస్థితి పరలోకమందున్నది, అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అనురక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము.

సమస్తము తనకు లోపరుచు కొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గల దానిగా మార్చును" (ఫిలిప్పీ 3:20,21). "మనమందరమును ముసుకు లేని ముఖములతో ప్రభువు యొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింప జేయుచు, మహిమనుండి అధికమహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆపోలికగానే మార్చబడుచున్నాము" (2 కొరిం 3:18).

బాప్తిస్మము ద్వారా యేసుప్రభువుకు విధేయత చూపినవారు క్రీస్తును ధరించు కున్నారు. వారు ఆయనరక్తము ద్వారా శుద్ధిచేయబడి క్రీస్తుసంఘమునకు చేర్చబడు చున్నారు. అట్టివారు ఆయన కుటుంబంలోని వారు. వారు దిన దినము ఆయన పోలికలోనికి మార్చబడుచున్నారు(2 కొరిం 3:18, గలతీ 4:19).

"సమస్తమును దేవుని వలననైనవి, ఆయన మనలను క్రీస్తుద్వారా తనతో ....... పరిచర్యను మాకు అనుగ్రహించెను (2 కొరిం 5:18). మనము ఆయన రక్తములో కడుగబడి ఆయనతో సమాధాన పడి మరలతిరిగి ఆయన పిల్లలమైనాము. "ప్రియులారా, యిపుడు మనము దేవుని పిల్లలమైయున్నాము మనమిక ఏమవుదుమో అది ఇంకా ప్రత్యక్షపరచబడలేదు ..... ఆయనను పోలియుందుమని యెరుగు దుము" (1 యోహాను 3:2).

మన ప్రభువును, రక్షకుడునైన యేసుక్రీస్తు ఆయన వధువుతో నిత్యము ఉండునట్లు ఆయన తన సంఘమునకు తిరిగి వచ్చుచున్నారు "మన మందరము నిద్రించముగాని నిమిషములో, ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే నమమందరము మార్పుపొందుదుము" (1 కొరిం 15:52)". ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగి వచ్చును, క్రీస్తు నందుండి మృతులైన వారు మొదట లేతురు ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము. (1థెస్స 4:16,17)" "చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను" (కీర్త 23:6). మనము నిత్యము ఆయనతో నుండ వలెననేది దేవుని పథకము. ఎప్పటికి ఆయనతోనే నివసించాలనే ఉద్దేశ్యం నీకేమైన ఉందా? సిద్ధపడు.

- కవిత గూటం

# ప్రతి మనుష్యుడు తెలిసికోవలసిన వాస్తవములు
## (Facts Each Must Face)

**జీవితం స్వల్పకాలమే :**

"స్త్రీ కనిన నరుడు కొద్ది దినములవాడై మిక్కిలి బాధనొందును. పువ్వు వికసించినట్లు వాడు పెరిగి వాడిపోవును, నీడ కనబడక పోవునట్లు వాడు నిలువక పారిపోవును" (యోబు 14:1-2).

"మీ జీవమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమై పోవు ఆవిరి వంటి వారు" (యాకోబు 4:14).

**మరణం ఖచ్చితం :**

"మనుష్యులొక్కసారే మృతిపొంద వలెనని నియమింపబడెను. ఆతరువాత తీర్పుజరుగును" (హెబ్రీ 9:27). మానవుని మేధాసంపత్తి, ఆర్థికబలము అంతా మరణమును తప్పించుకొనడానికి చేయుచున్న ప్రయత్నములే. అయినను అందరు చనిపోవుదురు. చావును తప్పించుకొనలేరు.

**నిత్యత్వము సుదీర్ఘము:**

"వీరు (దుర్మార్గులు ) నిత్యశిక్షకును, నీతి మంతులు నిత్య జీవమునకును పోవుదురు" (మత్తయి 25:46).

**తీర్పుతథ్యము:**

"మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆసింహాసనము ఎదుట నిలబడియుండుట చూచితిని అప్పుడు గ్రంధములు విప్పబడెను, మరియు జీవగ్రంథమను వేరొక గ్రంధము విప్పబడెను. ఆ గ్రంధముల యందు వ్రాయబడి యున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి" (ప్రకటన 20:12).

"ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరి 5:10).

**రక్షింపబడే మార్గము ఒకే ఒక్కటి యున్నది:**

"నేనే మార్గమును సత్యమును జీవమును, నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు" అని యేసు చెప్పెను (యోహాను 14:6). ఈ రక్షణ అందరికీ ఒకే లాగున లభ్యమవుతాది, సువార్తకు లోబడుట ద్వారా! క్రీస్తు సువార్తకు లోబడా లంటే యేసు ప్రభువునందు విశ్వాసముం చాలి (యోహా 8:34) పాపముల విషయమై మారుమనస్సు పొందాలి (అపొ.కా. 2:38; 17:30, లూకా 13:3,5); యేసే దేవుని కుమారుడని మనుష్యుల యెదుట ఒప్పుకొనాలి (మత్తయి 10:31-33; రోమా 10:10). పాపక్షమాపణ నిమిత్తము

యేసుక్రీస్తు నామమున నీటిలో ముంచ బడాలి (మార్కు 16:16; అపో.కా. 2:38; 22:16). మరియు మరణ పర్యంతము నమ్మకముగా జీవించాలి (ప్రకట 2:10; మత్త 10:22; యాకోబు 1:12).

## తీర్పునాడు నీసాకులు చెల్లవు
### (Judgement day excuses won't work)

దేవుడు అందరికీ తీర్పు తీర్చు ఆగొప్ప దినమందు ప్రజలు అనేక సాకులు ఆయనకు చెప్ప జూతురు (యూదా 6). వారు చెప్పే కొన్ని సాకులు దిగువ వివరించబడ్డాయి.

"ప్రభువా నీనామమున నేననేక గొప్ప కార్యములు చేసానుగదా, వాటి సంగతి యేమిటి?". అట్టివారిని గూర్చి మత్తయి 7:22లో ప్రభువు ముందే ఇట్లు చెప్పారు:"ఆ దినమందు అనేకులు నన్నుచూచి, ప్రభువా, ప్రభువా మేము నీనామమున ప్రవచింప లేదా? నీనామమున దయ్యములను వెళ్లగొట్టలేదా? నీనామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు, అప్పుడు నేనే మిమ్మును ఎన్నడును ఎరుగను అక్రమము చేయు వారాలారా నా యొద్దనుండి పొండని వారితో చెప్పుదును" వాళ్లెక్కడ పొరబాటు చేసారు? వారు పరలోకమందున్న తండ్రి చిత్త ప్రకారము చేయలేదు (మత్తయి 7:21). మనము సత్క్రియల యందాసక్తి గలవారమై యుండాలని ప్రభువు కోరుచున్నారు (తీతు 2:14). అయితే సత్క్రియలొక్కటే మనలను పరలోకమునకు చేర్చజాలవు.

"ప్రభువా నాఉద్యోగంలోనాకు తీరిక దొరికేది కాదు; ఆరాధనకు వచ్చుటకు వీలుపడలేదు". ఆరాధనకు వచ్చుటకు ముందుగనే నిర్ణయించు కోవాలి, ఆరాధనకు వెళ్లుటకు వాయిదాలు వేసుకో కూడదు. యేసు ఇట్లు చెప్పారు: ముండ్ల పొదలలో విత్తబడిన వారిని పోలిన వారు "వాక్యము విందురుగాని, ఐహిక విచారములును ధన మోసమును మరి ఇతరమైన అపేక్షలును లోపల చొచ్చి వాక్యమును అణచివేయుట వలన అది నిష్ఫల మగును" (మార్కు 4:19).

"ప్రభువా నా జీవిత విధానాన్ని గూర్చి చింతించుచున్నాను, నాకింకొక తరుణం యిస్తే నేను మంచిగా జీవిస్తాను":

రెండో తరుణం అంటూ ఎవనికీ ఇయ్యబడదు. "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను. ఆతరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తి హీనతను,

ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి..... ఈ లోకములో స్వస్థబుద్ధితోను నీతితోను భక్తితోను బ్రదుకు చుండవలెను"(తీతు 2:12-13). ఆ మహా తీర్పు దినముకొరకు మనం ఎల్లప్పుడు సిద్ధపడే యుండాలి. ఆరోజు ఏవిధమైన సాకులు చెల్లవు!.

## శ్రమ ఓర్పును కలిగించును
### (Suffering produces patience)

అపొస్తలుడైన పౌలు రోమాలోని క్రైస్తవులకు ఈ విధముగ వ్రాయుచున్నాడు. "శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగ జేయునని యెరిగి శ్రమల యందును అతిశయపడుదుము" (రోమా 5:3). శ్రమలలో యేవిధంగ సంతోషమును కలిగి యుందుము? శ్రమ యెట్లు ఓర్పును కలుగ జేయును?

క్రైస్తవ్యమును బట్టి అపొస్తలుడైన పౌలుతానే యెన్నో శ్రమలను అనుభవించెను. క్రీస్తు సువార్తను ప్రకటించుటలో అనేక సార్లు దెబ్బలు కొట్టిరి. సముద్రములో ఓడ పగిలి, గాలి వాన ఎదురై ఈ విధముగ అనేకసార్లు ఆపదలలో యుండి నప్పటికిని విశ్వాసులకు కలిగే బహు మానమును అందుకొనుటకు వాటన్నింటిని ఎంచదగినవిగా అతడు లెక్కించ లేదు. క్రీస్తుతో కూడ మనము శ్రమలను ఆయన కొరకు అనుభవించిన యెడల ఆయనతో కూడ మనము మహిమ పొంద గల్గుటకు ఆశించవచ్చును. "మనము దేవుని పిల్లలమని ఆత్మతానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమైతే వారసులము; అనగా దేవుని వారసులము; క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమ పడిన యెడల క్రీస్తుతోడి వారసులము" (రోమా 8:16-17). "క్షణమాత్రముండు మా చులకని శ్రమ మీ కొరకు అంత కంతకు యెక్కువగ నిత్యమైన మహిమ భారమును కలుగజేయు చున్నది" (2 కొరింథి 4:17). ఇందును బట్టి మనము గ్రహించ వలసినదేమనగా మన క్రైస్తవ జీవితమును బట్టి శ్రమ కలిగిన యెడల మనము ఆనందించ వలసిన వారమై యున్నాము. "నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకునపుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును ఈ లాగున వారు మీకు పూర్వమందుండిన

ప్రవక్తలను హింసించిరి" (మత్తయి 5:11-12).

దుర్మార్గులైన వారిని వారి దుర్మార్గతను బట్టి శిక్షించక మనకు హానిచేయునట్లు దేవుడు వారిని అంగీకరించు చున్నాడని మనము తలంచవచ్చును. కాని యేసు ఈ విధముగ చెప్పుచున్నారు. "దేవుడు తాను యేర్పరచుకొనిన వారు దివారాత్రులు తన్ను గూర్చి మొరపెట్టుకొను చుండగ వారికి న్యాయము తీర్చడా? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును" (లూకా 18:7). దుర్మార్గులైనట్టి వారికి శిక్ష విధించ కుండ దేవుడు వారిని తప్పించుకొన నీయడు. "మిమ్మును శ్రమ పరచు వారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే" (11థెస్స 1:9).

ఈ లోకములో మనము దేవుని కొరకు శ్రమలనను భవించిన యెడల మనము ఓర్పు కలిగి యుండుటకు నేర్చుకొందుము. ఓర్పు యందు బలము కలిగి దుర్మార్గులకు శిక్షయు, విశ్వాసులైనట్టి వారికి బహుమానము పొందుటకు కనిపెట్టుదము. " మన యెడల ప్రత్యక్షము కాబోవు మహిమ ఎదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నదగినవి కావని ఎంచుచున్నాను" (రోమా 8:18).

**గమనిక :**

**సత్యవాణి T.V. కార్యక్రమములను**
**ప్రతి బుధ, శుక్ర వారాల్లో సాయంత్రం 6:30 గంటలకు**
**రక్షణ ఛానల్ లోను, శనివారం సాయంత్రము 7 గంటలకు**
**UCC. ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం**
**6:00 గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే
సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను

నిడసన మెట్టలో సోదరులు భాస్కర పౌలు చింతలగారు క్రీస్తు కొరకు నిర్విరామ కృషి చేయుచు, ఈ సువార్త సభలు విజయ వంతముగా నిర్వహించ గలిగిరి.

ఏప్రియల్ 16వ తేదీనాడు అమలాపురం మండలం పాలగుమ్మిలో జరిగిన సువార్త కూటములో ఉదయం రిక్కీగూటం గారును, మధ్యాహ్నం యన్. ఏలియా గారును వాక్య పరిచర్య చేసిరి. యేసు ప్రభువు చేసిన అద్భుతములను గూర్చి రిక్కీగారు చక్కటి ప్రసంగము చేసిరి. నడిపూడి, పాలగుమ్మి, బండార్లంక గ్రామములలో సోదరులు డి. చిరంజీవి గారు ఉపాధ్యాయ వృత్తి చేసికొనుచు, దేవుని కొరకు మంచిపని చేయుచున్నారు.

ఏప్రియల్ 17వ తేదీ శనివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం గుంపర్రులో సువార్తికుల సదస్సు జరిగెను. సోదరులు డి. బిజయా గారు చాలకాలము నుండి గుంపర్రులో క్రీస్తు కొరకు కృషి చేయుచున్నారు. "ప్రభు రాత్రి భోజనము యొక్క ప్రాముఖ్యత" అనేఅంశముపై సోదరులు జి. షద్రక్ (పాలకొల్లు), జి. చిట్టిబాబు (తామరాడ), రిక్కీగూటం గార్లు చక్కటి వాక్యోపదేశము గావించిరి. జాన్.మోజెస్‌గారు (తోలేరు) ప్రార్ధన చేయగా సదస్సు ముగిసెను. గుంపర్రు క్రీస్తు సంఘము, డి. బిజయాగారు పలువిధముల కృషి చేసి సదస్సును జయప్రదముగా నిర్వహించిరి.

ఏప్రియల్ 20వ తేది రాత్రి కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీ వెనుక 'డిలైట్ గార్డెన్సు' ఫంక్షన్ హాలు తెరువబడెను. అక్కడ మొదటిగా దేవునికి స్తుతికూటము జరిగెను. ఆనాడు సోదరులు వి. సుదర్శన రావ్ (రాజమండ్రి) గారు మంచి వాక్యపరిచర్య చేసిరి. సోదరులు ఎలిపే. ప్రభాకర్ రావుగారు ప్రార్థించిరి. రిక్కీగారు అందరికీ వందనములు తెలియజేసిరి.

ఏప్రియల్ 20వ తేదీ మంగళవారం రిక్కీగూటంగారు సింగపూర్, ఆస్ట్రేలియా దేశాలలో జరుగుచున్న లెక్చర్‌షిప్‌లలో ఉపన్యసించుటకు గాను బయలు దేరి వెళ్లిరి. ఏప్రియల్ 21 నుండి 23 వరకు సింగపూర్‌లో యున్న క్రీస్తు సంఘములను, Four Seas Bible కాలేజీని దర్శించి వాక్యపరిచర్య చేయుదురు. తదుపరి ఆస్ట్రేలియాలో మెల్బోర్న్, సిడ్నీ పట్టణములను దర్శించి Hobartలో జరుగు Eastern Shore బైబిల్ లెక్చర్‌షిప్‌లో ఉపన్యసించెదరు. మేనెల 14వ తేదీ నాటికి తిరిగి కాకినాడ చేరుకొందురు.

## మీ కొక గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును . గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి:

***Satya Vani***

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**

**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2009-2011**

**To**

From:

SATYA VAKKU

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 001